
సామాన్యుడి ఆయుధం
తెలంగాణ ప్రభ
బుధవారం, మే 15, 2024
డిజిటల్



తెలంగాణ ప్రభ : (హైదరాబాద్) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై ముఖ్యమంత్రి రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ కేంద్రపాలిత ప్రాంతం అవుతుందని మాట్లాడేటోడికి.. మెదడు తక్కువ ఉన్నట్టు ఉందని దుయ్యబట్టారు. అది ఎప్పుడు చేస్తారో తెలియదు.. కేంద్రపాలిత ప్రాంతం అనేదే ఉండదన్నారు. కేటీఆర్ మిడి మిడి జ్ఞానంతో మాట్లాడుతున్నాడని తీవ్ర విమర్శలు చేశారు. సెకండ్ క్యాపిటల్ చేయండి అని కేటీఆర్ డిమాండ్ చేశాడు కదా అని ప్రశ్నించారు. వరంగల్ ని హైదరాబాద్ కి ధీటుగా అభివృద్ధి చేసే బాధ్యత తనదన్నారు. ఎయిర్ పోర్ట్.. ఆర్ఆర్ఆర్ ఏర్పాటు అందుకేనని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఐటీ కూడా వరంగల్ లో ఏర్పాటు చేస్తామని సీఎం పేర్కొన్నారు. మరోవైపు.. ఉచిత బస్ తో మెట్రో నష్టపోతుందని తెలిపారు. మరోవైపు.. ఐటీ అమ్ముకుంటాం అన్న కామెంట్స్ పై రేవంత్ రియాక్షన్ ఇచ్చారు. అమ్ముకుంటే అమ్ముకోమని తెలిపారు. మరోవైపు.. కేసీఆర్ ఏం మాట్లాడకుండా ఇంట్లో కూర్చుంటే గౌరవం.. ఇపుడు ఏం మాట్లాడినా పరువు తక్కువ అని దుయ్యబట్టారు. ఇదిలా ఉంటే.. మంత్రివర్గ విస్తరణ అధిష్టానం చూసుకుంటుందని.. ముదిరాజ్‌కి మంత్రి పదవి ఇస్తామని తెలిపారు. టికెట్లు ఇచ్చిన వాళ్లకు మళ్ళీ పదవులు ఉండవని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కాగా, ఆంధ్రప్రదేశ్ లో ఎవరు సీఎం అయినా సత్సంబంధాలు జరుపుతామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నెగిటివ్ ఆలోచనలు లేవని.. తనకు తెలంగాణ ముఖ్యం అని అన్నారు. పదేళ్లు.. వందేళ్ల విజన్ అందించాలి అనేదే తన పాలసీ అన్నారు. మరోవైపు.. ఏపీలో షర్మిల గెలవాలని కోరారు. అక్కడ కాంగ్రెస్ అధికారంలోకి రావాలి అని కోరుకుంటున్నట్లు చెప్పారు. ప్రయివేటు యూనివర్సిటీల్లో తప్పులు ఎవరు చేసినా చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

- వరంగల్ ని హైదరాబాద్ కి ధీటుగా అభివృద్ధి చేస్తాం
- కేసీఆర్ ఏం మాట్లాడకుండా ఇంట్లో కూర్చుంటే గౌరవం
- ముదిరాజ్‌కి మంత్రి పదవి ఇస్తాం
- టికెట్లు ఇచ్చిన వాళ్లకు మళ్ళీ పదవులు ఉండవు
- ఆంధ్రలో ఎవరూ సీఎం అయినా సత్సంబంధాలు

# కేటీఆర్‌ది మిడిమిడి జ్ఞానం

ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్‌రెడ్డి



## మెరుగైన ఫలితాలు సాధిస్తాం

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్**


తెలంగాణ ప్రభ (సిరిసిల్ల) : పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ పార్టీ మెరుగైన ఫలితాలు సాధిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల శాసనసభ్యులు కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. మంగళవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రగతిభవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. ఎన్నికల్లో కార్యకర్తలు నాయకుల కృషిని అభినందించారు. జాతీయ పార్టీలకు ప్రజల్లో విశ్వాసం లేకుండా పోయిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్ల రైతుల్లో, మహిళల్లో తీవ్ర వ్యతిరేకత కల్పించిందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఐదు నెలలు విమర్శలతో కాలయాపన చేశారని ఆరోపించారు. బిజెపి కూడా రాష్ట్రానికి చేసింది ఏమీ లేదని అన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ బీజేపీ దోస్తీ కడుతూ గల్లీలో లొల్లి చేస్తున్నాయని ప్రజలు గమనించారని తెలిపారు. జాతీయస్థాయిలో బిజెపి ప్రాముఖ్యత కోల్పోయిందని రానున్న రోజుల్లో ప్రాంతీయ పార్టీలె కీలకం కానున్నాయని తెలిపారు. సమావేశంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా పరిషత్ చైర్పర్సన్ అరుణ, మున్సిపల్ చైర్పర్సన్ జిందం కళ, చీటి నరసింహారావు, గూడూరు ప్రవీణ్, బొల్లి రామ్మోహన్, కోడి అంతయ్య, తదితరులు పాల్గొన్నారు.



## స్కూటీపై బండి చక్కర్లు

2లో





నాలుగు రోజుల పాటు తెలంగాణలో మోస్తరు నుంచి

# భారీ వర్షాలు

- మంగళవారం నుంచి శుక్రవారం వరకు పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందన్న వాతావరణ శాఖ
- తెలంగాణలోని పలు జిల్లాలకు

## ఎల్లో అలర్ట్ జారీ

**తెలంగాణ ప్రభ, (హైదరాబాద్) :** తెలంగాణలోని కొన్ని జిల్లాలలో రాగల మూడు రోజులలో తేలిక పాటు నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశ ముందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. మంగళ, బుధవారాలు కొన్ని జిల్లాల్లో గంటకు 30 కిలో మీటర్ల నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని... ఉరుములు, మెరుపులతో వర్షం కురువవచ్చునని తెలిపింది. గురువారం ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 కిలో మీటర్ల నుంచి 50 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశ ముందని తెలిపింది.

బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, రంగారెడ్డి, హైద రాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశముందని పేర్కొంది. గురువారం ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలతో పాటు నిజామాబాద్‌లో వర్షాలు కురువ వచ్చునని పేర్కొంది. సిద్దిపేట, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశ ముందని పేర్కొంది.

శుక్రవారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో, శనివారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

# స్కూటీపై బండి చక్కర్లు

కరీంనగర్ వీధుల్లో కుటుంబ సభ్యులతో సరదాగా..

- నిన్నటి వరకు క్షణం తీరికలేని రాజకీయ నాయకులు
- పోలింగ్ ముగియడంతో నేడు రిలీఫ్ అయిన
- ఆయా పార్టీల అభ్యర్థులు
- కుటుంబ సభ్యులతో బేకరీకి వెళ్లి ఐస్ క్రీమ్,
- సమోసా తిన్న సంజయ్







**తెలంగాణ ప్రభ, (కరీంనగర్) :** నిన్నటి వరకు తెలంగాణలో లోక్ సభ ఎన్నికల హడావుడి. నాయకులు... ముఖ్యంగా పోటీ చేస్తున్న అభ్యర్థులు ప్రచారంతో బిజీగా గడిపారు. కరీంనగర్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ కూడా నిన్నటి వరకు క్షణం తీరికలేకుండా ప్రచారంలో... కార్యకర్తల సమావేశాల్లో... బహిరంగ సభల్లో పాల్గొంటూ గడిపారు. నిన్న పోలింగ్ ముగియడంతో నాయకులు రిలీఫ్ అయ్యారు. బండి సంజయ్ కూడా నిన్న పోలింగ్ ముగియడంతో ఈరోజు తన కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు. స్కూటీపై సరదాగా కరీంనగర్ వీధుల్లో చక్కర్లు కొట్టారు. బేకరీకి వెళ్లి ఐస్ క్రీమ్, సమోసా తిన్నారు. ఆ తర్వాత స్కూటీ పైనే తిరిగి ఇంటికి వచ్చారు. బండి సంజయ్ కరీంనగర్ వీధుల్లో స్కూటీపై చక్కర్లు కొడుతున్న వైనాన్ని చూసేందుకు జనం ఆసక్తి కనబరిచారు.

# నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్యతీసుకోవాలి

- ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించినందుకు నిరసన
- నిబంధనల ప్రకారం టీఏడీఏ చెల్లించాలన్నందుకు
- పోలీసుల బలప్రయోగం
- తీవ్రంగా ఖండించిన టీఎస్ యుటీఎఫ్
- బాధ్యులైన అధికారులపై చర్య తీసుకోవాలి

## టీఎస్ యుటీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ డిమాండ్

**తెలంగాణ ప్రభ, (సిరిసిల్ల) :** ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయులపై పోలీసులతో లాఠీ చార్జి చేయించడాన్ని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటీఎఫ్) రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాకాల శంకర్ గౌడ్, గుండమనేని మహేందర్ రావు తీవ్రంగా ఖండించారు. మంగళవారం వారు స్థానికంగా మీడియాతో మాట్లాడారు. ఆర్డీఓ, పోలీసులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకే రకమైన రెమ్యూనరేషన్ ఇవ్వాలని పీఓ, ఏపీఓకు రోజుకు రూ.600, ఓపీఓలకు రూ.400 రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెం.61ని ఈ నెల 11 న విడుదల చేసిందన్నారు. ఆ ఉత్తర్వుల ప్రకారమే మెదక్ నియోజకవర్గం పరిధిలోని మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాల్లో పీఓ, ఏపీఓలకు రూ.3150 లు చెల్లించగా, నారాయణఖేడ్ లో రూ.2400 మాత్రమే ఇచ్చారని నిలదీశారు. ఒకే పార్లమెంట్ నియోజకవర్గంలో రెమ్యూనరేషన్ చెల్లింపులో తేడా ఎందుకని ప్రశ్నించినందుకు టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి లక్ష్మారెడ్డి, ఇతర ఉపాధ్యాయులపై ఆర్డీఓ ఆదేశాల మేరకు పోలీసులు విచక్షణా రహితంగా లాఠీచార్జి చేసి ఉపాధ్యాయులను గాయపరిచారని మండిపడ్డారు. నిబంధనలను పాటించకుండా, ప్రశ్నించిన ఉపాధ్యాయులపై దౌర్జన్యం చేసిన ఆర్డీఓ, పోలీసులపై చర్య తీసుకోవాలని టీఎస్ యుటీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ తరుపున డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు అంబటి రమేష్, కోశాధికారి పర్కాల రవీందర్, ఆడిట్ కమిటీ కన్వీనర్ వి మల్లేశం, కార్యదర్శులు ఎ శివకుమార్, పి స్వామి, జె రాజు, పి మల్లేశం, కె ప్రవీణ్, పి భాస్కర్, తిరుపతి జాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# 65.67 తెలంగాణలో.. లోక్‌సభ ఎన్నికల్లో శాతం పోలింగ్

- నగర ప్రాంతంలోనే అతితక్కువ ఓటింగ్
- బుధవారం నాటికి తుది పోలింగ్ శాతంపై
- స్పష్టత వచ్చే అవకాశం
- భువనగిరిలో అత్యధికంగా 76.78 శాతం పోలింగ్ నమోదు
- హైదరాబాద్‌లో 48.48 శాతం పోలింగ్



తెలంగాణ ప్రభ (హైదరాబాద్) : లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణలో 65.66 శాతం పోలింగ్ నమోదయింది. గత ఎన్నికల కంటే ఈసారి పోలింగ్ శాతం పెరిగింది. తుది పోలింగ్‌పై బుధవారం నాటికి స్పష్టత వచ్చే అవకాశముంది. అత్యధికంగా భువనగిరిలో 76.78 శాతం, అత్యల్పంగా 48.48 శాతం ఓటింగ్ నమోదయింది. అన్నింటికంటే పట్టణ ప్రాంతాలైన హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల నియోజకవర్గాల్లోనే అత్యల్ప ఓటింగ్ నమోదయింది. వివిధ లోక్ సభ నియోజకవర్గాల ఓటింగ్ ఇలా ఉంది... ఆదిలాబాద్ 74.03 శాతం, పెద్దపల్లి 67.87 శాతం, కరీంనగర్ 72.54 శాతం, నిజామాబాద్ 71.92 శాతం, జహీరాబాద్ 74.63 శాతం, మెదక్ 75.09 శాతం, మల్కాజ్‌గిరి 50.78 శాతం, సికింద్రాబాద్ 49.04 శాతం, హైదరాబాద్ 48.48 శాతం, చేవెళ్ల 56.50 శాతం, మహబూబ్ నగర్ 72.43 శాతం, నాగర్ కర్నూలు 69.46 శాతం, నల్గొండ 74.02 శాతం, భువనగిరి 76.78 శాతం, వరంగల్ 68.86 శాతం, మహబూబాబాద్ 71.85 శాతం, ఖమ్మం 76.09 శాతం ఓటింగ్ నమోదయింది.









# మోదీ నామినేషన్

## వారణాసిలో నామినేషన్ దాఖలు చేసిన నరేంద్ర మోదీ



**తెలంగాణ ప్రభ, (వారణాసి) :** ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం వారణాసిలో ఎన్నికల నామినేషన్ వేశారు. మోదీ తన ఆస్తులు మొత్తం రూ.3.02 కోట్లుగా పేర్కొన్నారు. తన వద్ద రూ.52,920 నగదు ఉందని వెల్లడించారు. అయితే, భూమి, కారు, ఇల్లు వంటి స్థిరచరాస్థులేవీ లేవని తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. మునుపటి ఎన్నికల అఫిడవిట్‌తో పోలిస్తే పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం ఈసారి రెట్టింపయ్యింది. 2018–19లో ఈ ఆదాయం 11 లక్షలు కాగా 2022–23లో అది రూ.23.5 లక్షలకు చేరుకుంది. ఇక ప్రధానికి సంప్రదాయక పెట్టుబడి సాధనాలపైనే మక్కువని కూడా ఈ అఫిడవిట్‌లో తెలిసింది. రూ.2.85 కోట్లను ఎస్బీఐలో ఎఫ్‌డీ చేశారు. మరో రూ.9.12 లక్షలను నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్‌లో పెట్టుబడి పెట్టారు. ప్రభుత్వ పెట్టుబడి పథకమైన ఎన్ఎస్‌సీతో ఏటా 7.7 శాతం వార్షిక వడ్డీ లభిస్తుంది. ఇందులో పెట్టుబడులకు సెక్షన్ 80సీ కింద మినహాయింపులు కూడా ఉన్నాయి. రిస్క్ తక్కువ ఉన్న పెట్టుబడి సాధనంగా దీనికి మదుపర్లలో పాప్యులారిటీ ఉంది. ఎన్ఎస్‌సీ ఒకేసారి ఐదు సంవత్సరాలకు గాను పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. కనీసం మొత్తం రూ.వెయ్యి. 2019 నాటి ఎన్నికల అఫిడవిట్‌లో మోదీ తనకు ఎన్ఎస్‌సీలో రూ.7.61 లక్షలు ఉన్నట్టు పేర్కొన్నారు. మరో రూ.1.28 కోట్ల ఎఫ్‌డీలు ఉన్నట్టు తెలిపారు. అప్పట్లో రూ.20 వేలు ఎల్ అండ్ టీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బాండ్ రూపంలో ఉందని మోదీ పేర్కొన్నారు. కానీ ఈమారు అఫిడవిట్‌లో మాత్రం బాండ్ల ప్రస్తావన లేదు. మునుపటి వలెనే మోదీ తన అఫిడవిట్‌లో ఈమెయిల్ ఐడీ, ఫోన్ నెంబర్‌ను పేర్కొన్నారు. అయితే, ఈ మొబైల్ వాట్సాప్‌కు లింక్ కాకపోవడం గమనార్హం. ట్రూ కాలర్‌లో మాత్రం ఈ నెంబర్‌కు పీఎమ్ నరేంద్ర జీ అన్న పేరు కనిపిస్తోంది.



# కోర మీసాల వేణుగోపాలస్వామి

## 165 సంవత్సరాలుగా వెలుగుతున్న అఖండ దీపం



రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం లో ఉన్న నేరెళ్ల గ్రామానికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. గ్రామంలో సుమారు 165 సంవత్సరాలకు పూర్వం ఇక్కడ నిర్మాణమైన వేణుగోపాల స్వామి ఆలయానికి ఒక ప్రత్యేకత ఉంది. ఆలయ నిర్మాణం 1847లో ప్రారంభించి విగ్రహ ప్రతిష్ఠాపన 1849లో పూర్తి చేసుకుంది. ఆలయంలోని వేణుగోపాలస్వామి విగ్రహా నికి కోరమీసాలు ఉండడం ప్రత్యేకత. తెలంగాణ ప్రాంతంలో మెదక్ జిల్లా దుబ్బాక మండలం కొల్లాపూర్ వేణుగోపాలస్వామి ఆలయంలో కోరమీసా లతో వేణుగోపాల స్వామి ఉంటారు. వేరే ప్రాంతం నుంచి తరలించు కొచ్చిన వేణుగోపాల స్వామిని గుర్తు పట్టకుండా ఉండేందుకు అక్కడ ఆలయంలో కోరమీ సాలతో వేణుగోపాలస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు అనేక కథనాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. నేరెళ్ల వేణు గోపాల స్వామి ఆలయంలో కోరమీసాలతో విగ్రహాన్ని ప్రతిష్ఠించడం వెనుక ప్రత్యేక కారణాలేవి లేవని గ్రామస్తులు తెలిపారు.

- అరుదైన షష్టి దేవత ప్రతిమ
- నేరెళ్ల రుక్మిణి వేణుగోపాలస్వామి ఆలయంలో అనేక ప్రత్యేకతలు
- తెలంగాణ ప్రభ ప్రత్యేకం





అల్లే రమేశ్
సీనియర్ జర్నలిస్ట్, సిరిసిల్ల

165 సంవత్సరాల నుండి ప్రతి ఏటా క్రమం తప్పకుండా వైశాఖ శుద్ధంలో ఆలయంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఆలయ ప్రాంగణంలోనే పంచాయతన ఆంజనేయస్వామి ఆలయం కూడా ఉండడం గమనార్హం. రథోత్సవంతో పాటు ఈ ఆలయంలో గజ వాహనంపై స్వామివారి ఊరేగింపు ప్రత్యేకమనే చెప్పాలి. ఉత్సవాల ముగింపు సందర్భంగా జరిగే రథోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రజలు ఉత్సవాలకు తరలివస్తు ఉంటారు. సిరిసిల్ల పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయ నిర్మాణాన్ని నమూనాగా తీసుకొని అప్పట్లో ఆలయాన్ని నిర్మించి నట్లు గ్రామస్తులు తెలిపారు.ఈ ఆలయానికి ఇంకో ప్రత్యేకత ఉంది. ఆలయం ఏర్పాటు నుండి ఇప్పటివ రకు ఏకధాటిగా 165 సంవత్సరాలుగా అఖండ దీపం వెలుగుతూనే ఉంది.



### అరుదైన షష్టి మాత రాతి ప్రతిమ

ఆలయంలో అరుదైన విగ్రహం వెలుగు చూడడం జరిగింది. ఆ విగ్రహాన్ని స్త్రీ దేవత షష్టి మాత విగ్రహంగా ప్రముఖ చారిత్ర పరిశోధకులు కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ తెలిపారు. ఇలాంటి విగ్రహాలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గతంలో కొన్ని ప్రాంతాల్లో కనిపించినట్లు తెలిపారు. ఇలా ఎన్నో ప్రత్యేకతలను ఆలయం సంతరించుకుంది. అఖండ దీపం, అరుదైన షష్టి మాత ప్రతిమలు ఆలయానికి ప్రాముఖ్యతను తీసుకొస్తున్నాయి. ఇవే కాక గ్రామంలో చారిత్రక విషయాలు అనేకం ఉన్నాయి. పాటిమీద ప్రాంతంలో రాష్ట్ర కుటుల కాలానికి చెందిన సప్త మాతృకల విగ్రహాలు వెలుగు చూశాయి. కథనం కోసం సహకరించిన జర్నలిస్ట్ మిత్రుడు పొన్నం చందుగౌడ్‌కు, సహకరించిన నేరెళ్ల గ్రామస్తులకు ప్రత్యేక ధన్యవాదాలు.





